# నవ్వుతాలు

తాత కృష్ణమూర్తిగారు బి. ఏ; యల్. టి.

## ధర్మసందేహము

"అమ్మా! అమ్మా! నిన్నొకటి అడగాలనుకొంటున్నాను. కోప్పడవు కదా?"

"అయ్యో! వెర్రితండ్రి! కోపగిస్తానా? అవశ్యం అడుగు;—ఏమిటి?"

"ఏమీ లేదు... నేను పుట్టకముందు, నన్నెప్పుడైనా చూశావా?"

చిరునవ్వుతో, తల్లి, "లేదు. ఏమి?"

"అయితే, మరి......పుట్టగానే, నేనే అని యెట్లా పోల్చుకున్నావు?"

## పెంకెపిల్ల

నా మనవరాలు రుక్మిణి, పెన్సిలొకటి చేతులో పట్టుకొని, పరుగెడుతూ నా దగ్గరకొచ్చి, "తాతా! తాతా! ఈ పెనసలు చూశావా? అన్ని రంగులూ రాస్తుంది. నీయిష్టం వొచ్చిన రంగు అడుగు." అన్నాది, నవ్వుతూ.

"ఏదీ ఆకుపచ్చరంగు రాసి, చూపించు." అన్నాను.

"ఇదిగో, చూడు." అంటూ, ఒక కాగితంముక్కమీద "ఆ...కు...ప...చ్చ." అని, వంకర టింకరగా అక్షరాలు రాసి చూపించింది.

## నోటిలెక్కలు

రాత్రిస్కూలు మాస్టరు—అసిరిగా! మీ అయ్య వందమామిడిపళ్లు ముగ్గవేశాడనుకో. అందులో ఐదో వొంతు పళ్లు కుళ్లిపోతాయనుకో. ఎన్ని పళ్లు నష్టం అన్నమాట?

అసిరయ్య—నష్టం ఉండదండి. కుళ్లు పళ్లన్నీయేరి, మా అమ్మ, బెల్లం పసుపు కలిపి, తాండ్రపోసి, అమ్మేస్తుంది.

## పుల్లయ్య

మూడోయేట ఆ అబ్బాయి యిరుగు పొరుగు పిల్లలతోకూడి యెప్పుడూ గోడ్డుబుగ్గి, బురద, మన్ను—వీటితోనే ఆట. పాపం, ఆ తల్లి తరుచుగా చాదడు నీళ్లు తెచ్చి, ఐదారుగురు పిల్లలున్నాయినా బలవంతంగా పట్టుకొని, వాళ్ల మొహాలు శుభ్రంగా కడిగి, చూసుకుంటేనేకాని, వాళ్లలో తన కొడుకెవరో పోల్చుకోలేక పోయేదట.

## పదిపక్షులు

5 వ తరగతిలో ఉపాధ్యాయుడొకనాడు "పలకలు తీసుకొని, మీరు చూచినవి యేవైనా పది పక్షుల పేర్లను వ్రాయుడు.' అని చెప్పెను.

ఒక బాలు డిట్లువ్రాసి చూపించెను :—

" 5 కాకులు, 3 పిచికలు, 2 కోళ్లు — మొత్తం 10."

## సత్యకాలము.

ముసలమ్మ — (కోడలితో) అమ్మా! గౌరూ! పాపం. ఆముష్టివాడి నెప్పుడూ పొమ్మనకు. అలాటి వాడికి పిడికెడు బియ్యం వేస్తేనే పుణ్యాం, చిన్నప్పటినుంచి, వాడికి మూగి, బ్రహ్మచెముడు నట.

కోడలు — అత్తా! వాడికి మూగి, చెవుడు అన్న సంగతి మీ కెట్లా తెలుసు?

ముసలమ్మ — వాడే చెప్పాడే. దీనంగా చేతులు జోడించి, నాతో, అమ్మా! మూగివాడికి బిచ్చం పెట్టండమ్మా! అన్నాడే. ఇంట్లో బియ్యం లేవని యెంత చెప్పినా వాడికి వినిపించదు కదా? చెవుడు కాక మరేమిటి?

## నూతనదాంపత్యము.

సరస్వతి కొత్తగా కాపురానికి వచ్చిన పిల్ల. అత్తగారికి సుస్తీగా ఉన్నందున, రాత్రి తానే వండవలసి వచ్చింది. భర్తకు వడ్డించుతూ, ఆ అమ్మాయి కళ్లుతుడుచుకొని, "అరటికాయలు కరకరలాడితే మీకు యిష్టం కదా అని, వేపుడు కూరచేసి, విస్తట్లో వేస్తే, అడకత్తెరయినా గుబ్బపాత్రం అయినా తెమ్మంటారు కదా, యేం న్యాయం చెప్పండి?" అని దీనంగా అడిగింది.

"అరటికాయ ముక్కలా యివి? అయితే, నావి పొరపాటే సుమా. జీడిపక్కలు కాల్చి, వేసేవను కొని, వాటిని చితకగొట్టడానికి యేదైనా తెమ్మన్నాను. ఇవి కూరముక్కలే అని చెప్పినావు గనుక, అవశ్యం పిడచపెట్టుకొని ఆపాళంగా తినేస్తాను. పళ్లు కాని ఊడిపోయినట్టాయినా, మళ్లీ కట్టించుకో వచ్చును. కడుపు నొప్పి పుడితే, రేపు ప్రొద్దున్నే, సోలడు ఆముదం తాగేస్తాను." అనిఅన్నాడు.

## డాబులు

"చిత్రలేఖనంలో అంతటి మహానుభావుడు మరి లేడండి. ఒకమాటాయన యేదో చెట్టు, పళ్లు నిరూపించే బొమ్మవ్రాసి, వ్రేలకడితే, యెక్కడలేని పక్షులూ వచ్చి, ఆపటం మీద వ్రాలేయట!"

"అంతేనా, అదేంగొప్ప? మొన్న మొన్న యెవడో బెంగాలీపెయింటరు ఒక—పెద్దపులిబొమ్మ వ్రానేటప్పటికి, దానికి నిజంగా ప్రాణం వొచ్చి, అతన్ని అమాంతంగా మింగేసిందంట!"

## వైద్యులు

పెద్దమనిషి — డాక్టరుగారూ! తేలుకాటుకు సరియైన మందు యేదైనా ఉన్నదా, అండి?

డాక్టరు — లేదు.

పెద్దమనిషి — (డాక్టరుతో షేక్‌హ్యాండ్ చేస్తూ.) వైద్యుల్లో కల్లా, మీరొక్కరు నిజం చెప్పినారు.

## అంతేకాబోలు

మాస్టరు — విశ్వసించడమనగా, అర్థమేమి?

విద్యార్థి — ఒకరు చెప్పేది, అబద్ధమని తెలిసికూడా, నిజమని ఒప్పుకో దలచుట.